# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-12-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశంలో జనగణనను రెండు దశల్లో నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.**
2. **ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాజెక్టుల పురోగతిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు.**
3. **గ్రామీణ నీటి సరఫరా శాఖలో సంస్కరణలు అవసరమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.**
4. **సమ్మక్క-సారలమ్మ జాతర సమయానికి చేపట్టిన అభివృద్ధి పనుల్ని పూర్తి చేస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.**
5. **నాటు సారా, కల్తీ మద్యం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు.**

==========================

దేశంలో జనగణనను రెండు దశల్లో నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర మంత్రివర్గ సమావేశం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిన్న ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశంలో జనగణనను నిర్వహించేందుకు 11 వేల 718 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. కొబ్బరి పంటకు కనీస మద్దతు ధరకు ఆమోదం లభించింది. సగటు నాణ్యత కలిగిన కొబ్బరి పంటకు ధర క్వింటాకు 12 వేల 27 రూపాయలుగా నిర్ణయిచింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును పూజ్య బాపూజీ గ్రామీణ రోజ్ గార్ యోజనగా మార్పు చేసింది. ఈ పథకంలో పని దినాలను 100 నుంచి 125కు పెంచింది. మంత్రివర్గ సమావేశం వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్ పాత్రికేయులకు వివరిస్తూ..

--------------------------

ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాజెక్టుల పురోగతిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విహంగ వీక్షణం ద్వారా నిన్న పరిశీలించారు. విశాఖపట్నం నుంచి హెలికాప్టర్ లో బయలుదేరిన ముఖ్యమంత్రి.. కాపులుప్పాడ ఐటీ హబ్, గిరిజన సహకార సంస్థ ప్రాజెక్టులను పరిశీలించారు. భీమిలిలోని టూరిజం హబ్ ప్రాంతాన్ని తిలకించారు. అక్కడకు సమీపంలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనుల పురోగతిని పరిశీలించారు. ఎయిర్ పోర్టుకు రహదారుల అనుసంధానంతోపాటు, టౌన్ షిప్ అభివృద్ధి తదితర పనులకు సంబంధించి అధికారులకు ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అలాగే భోగాపురం ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన

వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆనందపురం వద్ద డేటా సెంటర్లకు కేటాయించిన భూములను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పరిశీలించారు.

---------------------------

తెలంగాణలోని ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క-సారలమ్మ జాతర సమయానికి చేపట్టిన అభివృద్ధి పనుల్ని పూర్తి చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంత్రి దనసరి సీతక్కతో కలిసి మేడారం గద్దె, వాగు సమీపంలోని అభివృద్ధి పనులను ఆయన నిన్న పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

గ్రామీణ నీటి సరఫరా శాఖలో సంస్కరణలు అవసరమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులతో నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. స్వచ్ఛరథం, మ్యాజిక్ డ్రెయిన్ వంటి నూతన ఆలోచనలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రోడ్లు, స్వచ్ఛమైన తాగునీరు అందించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ పనులపై నిరంతర పర్యవేక్షణ చేసేలా సాంకేతికపరమైన మార్పులను తీసుకురావాలన్నారు.

---------------------------

నాటు సారా, కల్తీ మద్యం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలో ఎక్సైజ్ శాఖ అధికారులతో నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అక్రమ మద్యం నివారించడంలో సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. బెల్ట్ షాపులపై ఉక్కు పాదం మోపాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ – SIR కోసం ప్రత్యేక జాబితా పరిశీలకులను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో ప్రత్యేక సమగ్ర సవరణ –SIR ఓటర్ల జాబితాలను వీరు పరిశీలించనున్నారు. మొత్తం ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా పూర్తయ్యేలా చూసుకోవడానికి ప్రత్యేక జాబితా పరిశీలకులు ఆయా రాష్ట్రాల అధికారులతో భౌతికంగా లేక వర్చువల్ గా సమావేశాలను నిర్వహించనున్నట్లు తెలిపింది. అర్హులైన ఏ ఓటర్లు జాబితా నుండి తొలగించబడకుండా, ఓటర్ల జాబితాలో అనర్హులైన వ్యక్తులు ఎవరూ చేర్చబడకుండా ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తారని పేర్కొంది.

---------------------------

బొగ్గు, గనుల రంగంలో కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ

మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. చరిత్రలోనే తొలిసారిగా బొగ్గు ఉత్పత్తి, రవాణాలో 1 బిలియన్ టన్నుల లక్ష్యాన్ని సాధించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైన్స్, మినరల్స్ చట్టంలో మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. 2015 నుంచి గనుల కేటాయింపులో పారదర్శకంగా వేలం ప్రక్రియను ప్రారంభించడంతో గనుల కేటాయింపులో అవినీతి, అక్రమాలకు తావులేకుండా చేశామని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో రానున్న రెండు రోజులు పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి బి.శేఖర్ తెలియజేస్తూ...

వాయిస్..25 సెకన్లు

మరో వైపు.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలితీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్లోని మన్యం ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదవుతున్నాయి.

తెలంగాణాలో రానున్న 6 రోజులు పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది. వచ్చే

3 రోజుల తెలంగాణ అక్కడక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల వరకూ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, కొమరంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగాం, సిద్ధిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో శీతల గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్లోని పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి మట్టి, రాతి నాణ్యతను కేంద్ర బృందం నిన్న పరిశీలించింది. ఈ బృందం పోలవరం ప్రాజెక్టులోని పలు ప్రాంతాల్లో ప్రాథమిక సర్వేను నిర్వహించింది. కేంద్ర జలవనరుల శాఖ పరిధిలో మట్టి, రాతి నాణ్యత పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తల బృందం ప్రాజెక్టులోని పలు ప్రాంతాల్లో పర్యటించి, నాణ్యత నియంత్రణ పరీక్షలు నిర్వహించనుందని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఈ రోజు కూడా శాస్త్రవేత్తల బృందం ప్రాజెక్టులో నాణ్యతా నియంత్రణ పరిశీలన చేయనుంది.

---------------------------

ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చే పవిత్ర గోదావరి పుష్కారాలకు ముహూర్తాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఖరారు చేసింది. 2027 జూన్ 26 నుంచి గోదావరి పుష్కరాలు ప్రారంభం అవుతాయని దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 12 రోజుల పాటు పుష్కరాలు కొనసాగుతాయని పేర్కొంది. గోదావరి పుష్కరాల తేదీలు, ముహూర్తంపై తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకట కృష్ణ పూర్ణ ప్రసాద్ వివరాలను ఎండోమెంట్ కమిషనర్ కు అందించారు.

====================